క్లుప్తంగా

ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డీపీవో

మల్యాల: గ్రామాల్లో అవసరమైన చోట కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ అన్నారు. మల్యాల మండల కేంద్రంలో మంగళవారం ఆయన పలు చోట్ల ఇంకుడు గుంతలను పరిశీలించారు. మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశం, తహసీల్దార్ సుజాత, ఎంఈవో ఐత శ్రీనివాస్, ఈజీఎస్ ఈసీ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనాలు త్వరగా పూర్తిచేయాలి



జీపీ భవనానికి స్థలం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఇబ్రహీంపట్నం: గ్రామపంచాయతీ నూతన భవనాలను త్వరగా నిర్మించాలని డీఎల్‌పీవో అన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న పంచాయతీ భవనాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఇబ్రహీంపట్నం, బర్దీపూర్, ఎర్రాపూర్‌తండా, వర్షకొండ ఒకొక్క దానికి రూ. 20 లక్షల చొప్పు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం,వర్షకొండలలో ఇంకా పనులు పూర్తి కాలేదని త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని సర్పంచులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీరాజ్ ఏఈ అరుణ, ఉపసర్పంచ్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణ, నాయకులు నేమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

ధర్మపురి: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని సీఐ రమణమూర్తి అన్నారు. ధర్మపురి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఆటో డ్రైవర్లు, యజమానులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా మాట్లాడుతూ .. ప్రయాణికులను క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చడానికి ఆటో డ్రైవర్ల పాత్ర కీలమని మద్యం తాగి నడపడం, ఆటో నడిపే వారికి లైసెన్సులు, ప్రతి ఆటోకు ఇన్సురెన్స్ తప్పక అవసరమని ఇవి లేకుండా ఆటోలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోల్లో కెపాసిటికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. లా అండ్ ఆర్డర్ విషయంలో సహకారం అందించాలని అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని ఆటో డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయ పనులు అడ్డగింత



పనులు అడ్డుకుంటున్న స్థానికులు

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద టెలిఫోన్ ఎక్చేంజ్ పక్కన డీసీఎంఎస్ కార్యాలయం శిథిలావస్థలో ఉండేది. కార్యాలయానికి సుమారు 9 గుంటల ఖాళీ స్థలం ఉంది. దీనిలో నూతన కార్యాలయ నిర్మాణ పనులను చేపట్టేందుకు మంగళవారం పనులు చేపట్టగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రభుత్వ కార్యాలయం నిర్మించవద్దని, కాలనీవాసులకు పార్క్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పనులు అడ్డుకున్నారు.

నేడు పెగడపల్లిలో మంత్రి పర్యటన

పెగడపల్లి:మండలంలోని నామాపూర్, కీచులాటపల్లిలో బుధవారం మంత్రి ఈశ్వర్ పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి తెలిపారు, ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

నిర్మించినా.. నిరుపయోగమే

- వీధి వ్యాపారుల కోసం రూ.5 లక్షలతో షెడ్లు ఏర్పాటు
- అధికారుల అనాలోచిత చర్యలతో ప్రజాధనం వృథా
- రెండేళ్లు గడిచినా వినియోగించని వైనం



బస్ డిపో వద్ద నిర్మించిన షెడ్లు

మెట్‌పల్లి: అధికారుల అనాలోచిత చర్యలతో ప్రజాధనం వృథా అవుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేయాల్సిన అధికారులు..దానికి భిన్నంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో వీధి వ్యాపారుల కోసం రూ.5 లక్షల నిధులను వెచ్చించి ప్రత్యేకంగా షెడ్లను నిర్మించారు. రెండేళ్ల గడిచినా ఇంతవరకు అవి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో వృథాగా ఉన్నాయి. మెట్‌పల్లి మున్సిపాలిటీలో రోజురోజుకు చిరు వ్యాపారుల సంఖ్య పెరుగుతోంది. పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి, వెల్లుల్ల, చావిడి, వేంపేట రోడ్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో వ్యాపారులు ఉంటారు. వీరిలో కొందరు ప్రభుత్వం అందించిన రుణాలతో వ్యాపారాలను అభివృద్ధి చేసుకున్నారు. అయితే రోడ్లపై వ్యాపారాలు చేసుకోవడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని ప్రభుత్వం వీరికి ప్రత్యేకంగా స్థలాలను కేటాయించాలని సూచించింది. ఆయా స్థలాల్లో షెడ్లను ఏర్పాటు చేయాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. దీంతో బస్ డిపో సమీపంలో పట్టణ ప్రగతినిధులు రూ.5లక్షలతో రెండేళ్ల క్రితం షెడ్లను నిర్మించారు. కానీ ఇంతవరకు అక్కడికి వ్యాపారులను మాత్రం తరలించలేదు. నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో జన సంచారం అంతగా ఉండదు. అక్కడ వ్యాపారాలు అంతగా నడిచే అవకాశం లేదు. దీనిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు షెడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ కారణం వల్లనే వ్యాపారులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

తొలగని ట్రాఫిక్ తిప్పలు..

- స్థానికంగా ప్రధాన రహదారుల్లో ఎక్కడ చూసిన చిరు వ్యాపారులే కనిపిస్తారు.
- గతంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో వీరి సంఖ్య 500 పైగానే ఉంది.
- ప్రత్యేక స్థలాల కేటాయింపు జరపకపోవడంతో రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.
- దీనివల్ల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ప్రస్తుతం ఖాదీ స్థలంలో సమీకృత మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. ఇది వినియోగంలోకి వస్తే కొంత మందిని అక్కడకు తరలించే అవకాశముంది.
- అయినప్పటికీ ఎక్కువ సంఖ్యలో చిరు వ్యాపారులకు రోడ్లే దిక్కవుతాయి.

స్థలాలు అందుబాటులో లేవు



పట్టణంలో షెడ్ల నిర్మాణానికి స్థలాలు అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగా మారింది. బస్‌డిపో వద్ద నిర్మించినప్పటికీ అక్కడకు వెళ్లడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. సమీకృత మార్కెట్ పనులు తుది దశలో ఉన్నాయి. అవి పూర్తి కాగానే వ్యాపారులను అందులోకి తరలిస్తాం. అది వినియోగంలోకి రాగానే రహదారులపై వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వం.

– జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్

- ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అవసరమైన చోట షెడ్లను ఏర్పాటు చేస్తే చిరు వ్యాపారులకు ఇబ్బందులు తొలుగుతాయి.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాయికల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

రాయికల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరై మాట్లాడారు. ఒక దళిత మహిళను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పదవీ దక్కించుకోవడం రాయికల్ చరిత్రలోనే నిలిచిపోయిందన్నారు. దళితుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, రైతులు పంటల సాగు కోసం ప్రాజెక్టులు, డ్యామ్‌లు నిర్మించారని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, గతంలో మంత్రిగా పనిచేసిన జీవన్‌రెడ్డి రాయికల్‌ను ఏం అభివృద్ధి చేశారని, కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడానికే సరిపోతున్నారన్నారు. అనంతరం చైర్‌పర్సన్‌గా మారంపల్లి రాణి, వైస్ చైర్మన్‌గా బర్కం మల్లేశం, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం చేరేవరకు శ్రమించాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే లక్ష్యం ఏర్పరచుకుని గమ్యం చేరేవరకు శ్రమించాలని సర్పంచ్‌లు వనతడుపుల నాగరాజు, అలిశెట్టి రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మొగిలిపేట, ఒబులాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్స్, సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుండే కష్ట పడేతత్వాన్ని అలవర్చుకుని ఒక గొప్ప లక్ష్యం వైపు అడుగులు వేస్తే తాను చదివిన పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రుద్ర రాంప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

బ్యాగులు పంపిణీ

ధర్మపురి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 50 మంది పేద విద్యార్థులకు మంగళవారం బ్యాగులు పంపిణీ చేశారు. జగిత్యాలకు చెందిన సామ ఉమాపతి, సంధ్యారాణి దంపతులు గత కొంత కాలం నుండి నిరుపేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నారు. సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ కోరిక మేరకు ఎస్సీ కాలనీలోని పేద విద్యార్థుల బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయులు బండి మహేశ్, గుండి రమాదేవి, లయన్స్‌క్లబ్ బాధ్యులు జక్కు దేవేందర్ తదితరులున్నారు.

కుల వ్యవస్థ నిర్మూలన కోసం పూలే పోరాటం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



డబ్బాలో పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: దేశంలో కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడిన వీరుడు మహాత్మ జ్యోతిరావు పూలేనని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని డబ్బా గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పూలే బడుగు, బలహీనుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపిన పోరాటయోధుడన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కమటం భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ లింగంపెల్లి గంగాధర్, ఎంపీటీసీ దేశెట్టి శాంత, పుప్పాల నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొండగట్టు: కొడిమ్యాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చెన్న లక్ష్మీనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. పార్టీ సభ్యత్వం, ప్రమాద బీమా ఉండటంతో రూ. 2 లక్షల బీమా చెక్కు మంజూరైంది. మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బాధిత కుటుంబానికి అందజేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ కృషి చేస్తోందన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి కృషి

కోరుట్ల: కుల సంఘాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని రజక సంఘ అభివృద్ధి కోసం మంజూరైన రూ. 4 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను మంగళవారం సంఘం నాయకులకు అందజేశారు. నియోజకవర్గంలో కుల సంఘాల అభ్యున్నతికి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, స్థానిక కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షుడు కొమ్మనపెల్లి శంకర్, సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే ప్రజలకు న్యాయం



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: బీజేపీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ జిల్లా నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు బూత్‌లలో పర్యటించిన బీజేపీ నాయకులు నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలన, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ముద్దం రాములు, కార్యదర్శి నలువాల తిరుపతి, బూత్ అధ్యక్షుడు ముద్దం గంగారెడ్డి, చుక్క ప్రకాశ్, కొసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ నాయకుల ప్రచారం

కథలాపూర్: మండలంలోని పోతారంలో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు నాయకులు వివరించారు. 9 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అవినీతిలేని పాలన బీజేపీతోనే సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కంటి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

తీరిన లోవోల్టేజీ సమస్య

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లిలోని ఒడ్డెర, యాదవ కాలనీలకు లోవోల్టేజీ సమస్య తీరింది. మంగళవారం సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు బిగించడంతో కాలనీల్లో సమస్య తీరింది. లోవోల్టేజీ సమస్యపై సర్పంచ్ ఎలగందుల లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే సంజయ్‌ను కలిసి సమస్య వివరించడంతో సమస్య పరిష్కరించారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఏడీఈ హరీశ్, ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గౌడ కులస్తులు, మహిళలు పోచమ్మ ఎల్లమ్మలకు బోనాలు చేశారు. డప్పుచప్పుళ్లతో నెత్తిన బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు. గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో భక్తుల పూజలు

ధర్మపురి: మండలంలోని రాజారం ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాసం సందర్భంగా ధర్మపురితో పాటు వివిధ మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

మల్యాల: అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని జగిత్యాల జిల్లా అధ్యాపకుల సంఘం(475) జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్ అన్నారు. జిల్లా లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా అత్తినేని శ్రీనివాస్‌ను, వర్కింగ్ ప్రెసిడెంట్ గగడం రచన, స్టేట్ కౌన్సిలర్ కాశవేని శ్రీనివాస్‌ను మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, కళాశాల అధ్యాపకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా అత్తినేని శ్రీనివాస్ మాట్లాడుతూ దశాబ్దకాలానికిపైగా అధ్యాపకుడిగా, విద్యార్థుల సమస్యలు, అధ్యాపకుల సమస్యలను దగ్గరి నుండి పరిశీలించానన్నారు. ప్రభుత్వపరంగా అధ్యాపకులు పొందాల్సిన హక్కులను సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పొన్నం లక్ష్మీనారాయణ, మహమ్మద్ నవాబ్, యముల శ్రీనివాస్, వేనెపల్లి సంధ్య, దమ్మయ్యగారి శ్రీకాంత్, బాసని నరేశ్, పురాణం శ్రీధర్, నగునూరి పూర్ణిమ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక పోటీలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4వ, 5వ తరగతి విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపికకు పోటీలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు మంగళవారం తెలిపారు. 15 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా వారికి పోటీలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు త్వరలో జగిత్యాలలో జరిగే జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేష్, పీడీ కృష్ణప్రసాద్, పీఈటీలు రాజు, సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు

వెల్గటూర్: మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక క్రీడా పోటీలు మంగళవారం ఎంఈవో బత్తుల భూమయ్య పర్యవేక్షణలో వెల్గటూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 10 విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పోటీల్లో ఎండపల్లి మండలం నుంచి 16 మంది, వెల్గటూర్ నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నోటుబుక్కులు, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఫౌండేషన్ బాధ్యులు ఓగుల అజయ్, హెచ్‌ఎం రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం కే. లలిత తెలిపారు.ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిట్రసీ ఫర్ స్కూల్ చిల్డ్రెన్ పై నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పదో తరగతి విద్యార్థిని ఏ. వేదశ్రీ, తొమ్మిదో తరగతి విద్యార్థి డి.సాయిదీప్‌లు తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని గైడ్ టీచర్ వెంకటస్వామి, సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

బదిలీల షెడ్యూల్ విడుదలపై హర్షం

కోరుట్ల రూరల్: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయటం పట్ల ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజు జాదవ్, ప్రధాన కార్యదర్శి వాసం మహేశ్,ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

'బండి సంజయ్‌ను తొలగించడం అవివేకం'

సారంగాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను తొలగించడం బీజేపీ నాయకుల అవివేక చర్య అని మున్నూరు కాపు అభివృద్ధి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బాస నాగేంధర్ పటేల్ అన్నారు. బండి తొలగించడంపై తమ కార్యాచరణ త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

వెల్గటూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై చేయాలని బీజేపీ విస్తారక్ దీపక్‌సింగ్ శఖావత్ అన్నారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండల అధ్యక్షుడు తంగళ్లపల్లి చక్రపాణి ఆధ్వర్యంలో మంగళవారం నాగొపెల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం, మండల ఇన్‌చార్జి పిల్లి శ్రీనివాస్, కొత్తపేట సర్పంచ్ కొమ్ము రాంబాబు, వివిధ మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో పశువైద్య శిబిరం

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్‌లో కోరుట్ల పశువైద్య కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ తోట నారాయణ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శారద, కళాశాల అసోసియేట్ డీన్ టి. మాధవరావు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ దైవ కృష్ణప్రసాద్, ప్రొఫెసర్లు, రైతులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడికి నివాళి

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్వామి వివేకానంద వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.నాయకులు, యువకులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి

వెల్గటూర్: తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్‌కు మంగళవారం కొత్తపేటలో మండల కళాకారులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో నిమ్మ రాము తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు

గొల్లపల్లి: మండలంలోని ఇబ్రహీంనగర్, శ్రీరాములపల్లి గ్రామంలోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణానికి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ గ్రామ సర్పంచ్ నేరెల్ల గంగారెడ్డి, కుల సంఘ నాయకులకు అందజేశారు. ఉపసర్పంచ్ ఏలేటి అశిరెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శునకాలకు ఉచితంగా టీకాలు

జగిత్యాలటౌన్: ప్రపంచ జునోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శునకాలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు జగిత్యాల పశువైద్య సహాయ సంచాలకులు డా మదన్‌మోహన్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ జునోటిక్ డే సందర్భంగా ఈనెల 6న గురువారం రోజున జగిత్యాల ప్రాంతీయ వైద్యశాలలో శునకాలకు ఉచితంగా యాంటిరేబిస్ టీకాలు వేస్తామని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

పెగడపల్లి:సీజనల్ వ్యాధుల నివారణపై ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు సర్పంచులను ఆదేశించారు. మండలంలోని మద్దులపల్లి, పెగడపల్లి గ్రామాలను ఎస్‌బీఎం హరిణి తో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని పల్లె ప్రగతిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నూతన నియామకం

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడిగా పొన్నం శేఖర్‌ను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు పొన్నం శేఖర్‌కు నియామక పత్రాన్ని అందించారు.


'గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం'

మెట్‌పల్లి: గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమొరెడ్డి కరం అన్నారు. మంగళవారం మెట్‌పల్లిలో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే వలస వెళ్లకుండా ఇక్కడే ఉపాధి కల్పిస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ల గడిచినప్పటికీ ఇంతవరకు దానిని నిలబెట్టుకోలేదన్నారు. అలాగే అక్కడ మరణిస్తే మృతదేహాలను స్వగ్రామానికి తరలించే విషయంలో జాప్యం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గల్ఫ్ కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్లాపూర్: 33 కేవీ విద్యుత్ లైన్ల ప్రత్యేక మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 1 గంటల వరకు మల్లాపూర్ మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించగలరని ట్రాన్స్‌కోటేఈ వినీత్ రెడ్డి తెలిపారు.

గాలి గోపురాలు నిర్మించేదెప్పుడో?



పెగడపల్లి: మండలంలోని పలు ఆలయాల్లో గాలి గోపురాలు నిర్మాణాలు అటకెక్కాయి. పెగడపల్లిలో రాజరాజేశ్వర స్వామి, మండలంలోని నంచర్ల శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయాల్లో గాలి గోపురాల నిర్మాణాలకు మంత్రి ఈశ్వర్ చొరవ చూపి దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి ఒక్కో ఆలయానికి రూ. 1 కోటి చొప్పున నిధులు మంజూరు చేయించారు. సంబంధిత శాఖ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేయించారు. ఈ మేరకు మంత్రి ఈశ్వర్ నిర్మాణ పనులకు ఇటీవల శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి నెలలు దాటినా పనులు ప్రారంభించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రజలు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి గాలి గోపురాల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆలయాల కమిటీ సభ్యులు, ప్రజలు కోరుతున్నారు.